క్లుప్తంగా

డిసెంబర్ 9న జాతీయ లోక్‌దాలత్

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు భవనాల సముదాయంలో డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్‌జడ్జి బీ.బాబూనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ చేసుకోదగిన అన్ని సివిల్, క్రిమినల్, బ్యాంక్ చెక్ కేసులు లోక్ ఆదాలత్‌లో పరిష్కరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి కక్షిదారుడు వినియోగించుకోవాలని తెలిపారు.

పర్చూరు (చినగంజాం): దేశ వ్యాప్తంగా డిసెంబర్ 9న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం సుధ ఒక ప్రకటనలో తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వేటపాలెం: వరి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ సూచించారు. దేశాయిపేట–3 రైతు భరోసా కేంద్ర పరిధిలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలను పరిశీలించి వరి పైరులో తీసుకోవాల్సి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగులో మెలుకువలు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు మనీషా, కావ్య, జ్యోతి, సునీల్, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

చినగంజాం: మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ (మోడల్ పేపర్స్)ను మంగళవారం దాతలు పంపిణీ చేశారు. మట్టిగుంట గ్రామానికి చెందిన బండారుపల్లి శింగరబాబు (టీటీడీ విజిలెన్స్ ఉద్యోగి), బీ ముకుంద మాల, వై బ్రహ్మారావు, రోజారాణి, బోగిరెడ్డి ఝాన్సీ, బీ సీతామహాలక్ష్మిలు 75 మందికి సుమారు రూ.20 వేల విలువ కలిగిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాల హెచ్ ఎం ఎం దేవదత్తం, ఉపాధ్యాయులు ఎస్ శ్రీ రమణ, ఏ వీరాచారి తదితర ఉపాధ్యాయులు దాతలను అభినందించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనలు


విద్యార్థులను ప్రశ్నలడుగుతున్న ఎంఈవో సత్యన్నారాయణ

దగ్గుబాడు (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సులభతర విద్యాబోధనలు చేయాల్సి ఉందని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని దగ్గుబాడు అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఉదయం అసెంబ్లీ నుంచి ఆయన విద్యార్థులతో కలసి ఉన్నారు. ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. తరగతి అయిన తరువాత విద్యార్థులకు ఎంత వరకు అర్థమయ్యిందనే విషయమై వారిని ప్రశ్నించి సమాధానాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు తప్పితే చర్యలు తప్పవన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో కార్తీక పూజలు


శివాలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసం సందర్భంగా చిన అంబడిపూడి గ్రామంలోని గంగాపార్వతిదేవి సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడితో కోలాహలం నెలకొంది. ఆలయంలోని ఆంజనేయస్వామికి మంగళవారం సింధూరపూజ తమలపాకులతో అర్చన అభిషేకాలు చేపట్టారు. రాత్రికి నందివాహన సేవ, పల్లకి ఉత్సవం, శోభాయమానంగా నిర్వహించారు. అర్చకులు పేటేటి లక్ష్మీ వరప్రసాదరావు ధర్మకర్త గంగవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రతి రోజు కార్తీక మాస విశిష్టతను తెలియజేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

పారదర్శకంగా కులగణన చేపట్టాలి


వేటపాలెంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి దెబోరా


కారంచేడులో సిబ్బందికి సూచనలిస్తున్న మాస్టర్ ట్రైనర్ ప్రద్యుమ్నకుమార్


కొరిశపాడు: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు


బల్లికురవలో కులగణనపై శిక్షణ ఇస్తున్న శిక్షకుడు

● 27వ తేదీ నుంచి కులగణన

కారంచేడు/యద్దనపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణన సర్వేకు కేటాయించిన సిబ్బంది పటిష్టంగా నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆమె మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన కులగణన సర్వే సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్, పర్చూరు ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ సచివాలయాలకు సంబంధించిన సిబ్బందిని మాత్రమే ఈ సర్వే కోసం ఎంపిక చేశారని తెలిపారు. వారు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ఏ ఒక్కరూ తమ విధులను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించి నివేదికలను అందజేయాలన్నారు. ఈనెల 27వ తేదీ నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు జరిగే సర్వేలో సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో కారంచేడు ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, డీటీ పీ సుశీల, కారంచేడు, కుంకలమర్రు, ఆదిపూడి గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

☛ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాధికార ఆర్థిక కులగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని యద్దనపూడి ఎంపీడీఓ కృష్ణకుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వీఆర్వోలు, సర్వేయర్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 27 నుంచి డిసెంబర్ 3 వరకు గ్రామాల వారీగా కులగణన సర్వే చేపట్టాలన్నారు. కులగణన వల్ల రాష్ట్రంలో ఏ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలియడంతో పాటు వారి ఆర్థిక పరిస్థితులపై అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పొప్పులు జరగకూడదు..

వేటపాలెం: ఈ నెల 27వ తేదీ నుంచి చేపట్టనున్న కులగణను పారదర్శంగా నిర్వహించాలని ప్రత్యేక అధికారి దెబోరా ఆదేశించారు. స్థానిక ఐసీడీఎస్ సమావేశంలో హాల్లో కులగణనపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. సమావేశంలో ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిబ్బంది ఇంటింటికి తప్పనిసరిగా వెళ్లాలని ఆదేశించారు. ఒక సచివాలయ ఉద్యోగితో పాటు, ఒక వలంటీర్ సర్వేలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఇచ్చిన యాప్‌లో పేర్లు నమోదు చేసి ఈ–కేవైసీ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా క్షుణ్ణంగా యాప్‌లో ఇచ్చిన సమాచారం పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్‌డీ శ్రీలక్ష్మీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేపై సిబ్బందికి అవగాహన సదస్సును మంగళవారం మండల కేంద్రం కొరిశపాడులో నిర్వహించారు. సదస్సులో కొరిశపాడు సచివాలయం–1,2, బొడ్డువానిపాలెం, దైవాలరావూరు, పీ.గుడిపాడు సచివాలయాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి, వలంటీర్లకు ఎంపీడీవో సురేష్‌బాబు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బల్లికురవ: కులగణనలో భాగంగా తప్పులు దొర్లకుండా సకాలంతో పూర్తి చేయాలని మాస్టర్ ట్రినర్ పర్చూరు ఏఎస్‌వో శ్రీమన్నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో బల్లికురవ, చెన్నుపల్లి. ముక్తేశ్వరం, కొమ్మినేనివారి పాలెం, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, పంచాయితీని కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి కులగణనపై అవగాహనతో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుమతి, ఏఎస్‌వో అమర్‌నాథ్ పాల్గొని మాట్లాడారు.


కులగణన సర్వేపై అవగాహన కల్పిస్తున్న యద్దనపూడి ఎంపీడీఓ కృష్ణకుమారి

వచ్చే ఎన్నికల్లో జగనన్నే మళ్లీ సీఎం


పెదఅంబడిపూడిలో లబ్ధిదారుల బోర్డు ఆవిష్కరిస్తున్న పేరయ్య, నాయకులు


మున్నంవారిపాలెం సచివాలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

● ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

చినగంజాం/యద్దనపూడి/కారంచేడు: వచ్చే ఎన్నికల్లో మరళా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. చినగంజాం మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ' కార్యక్రమం మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో గత నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా గ్రామానికి చేకూరిన లబ్ధికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే స్వరూపరాణి, ఈఓపీఆర్డీ వేణుగోపాల కృష్ణమూర్తి, ఎన్ జయసింహారెడ్డి, మాజీ సర్పంచ్ కేవీ రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్, శంకరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

✎ ఇంకొల్లులో మండలంలోని పావులూరు–2 సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం సాయంత్రం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సచివాలయం ఆవరణలో ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధికి సంబంధించిన వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, సర్పంచ్ బొల్లెద్దుల లుధియమ్మ, అశోక్, మాజీ సర్పంచ్ పులఖండం బద్దిరెడ్డి, రావిపూడి వేణు, సొసైటీ చైర్మన్ పీ రామకృష్ణారెడ్డి, కన్వీనర్ సింహాద్రి సంధ్య, గుంజి రాంబాబు, వార్డు సభ్యులు పావులూరి బూసి, సింహాద్రి సుబ్బారెడ్డి, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి ఎం అజయ్‌కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంపత్, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

✎ కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామంలో సర్పంచ్ గేరా రవీంద్రనాథ్‌ఠాగూర్ అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్'నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్ బాబు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

✎ యద్దనపూడి మండలం యనమదల సర్పంచ్ రాయి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండా, సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణకుమారి, ఈఓఆర్డీ శ్రీనివాసరావు, నాయకులు మారెళ్ల శ్రీదర్, జంగా ఏలీయా, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి..

బల్లికురవ: సంక్షేమ పథకాలపై గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా రైతు అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య అన్నారు. మంగళవారం పెద అంబడిపూడి సచివాలయం వద్ద వైఎస్సార్ జెండా ఆవిష్కరణతోపాటు, డిస్ప్లేబోర్డు, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, జేసీఎస్ అధ్యక్షుడు టి. నరేష్, పార్టీ నేతలు ఈర్తినేని పెద్దన్న, షేక్ శ్రీనువలి తదితరులు పాల్గొన్నారు.

చీరాల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ గోలి స్వాతి ఆధ్యక్షతన క్లస్టర్–2 పేరాల గొల్లపాలెం సచివాలయం పరిధిలో పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచనలతో ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఏసీఎస్ పట్టణ ఇన్‌చార్జులు కోలా శివ, దాసరి రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు గోలి జగదీష్, బత్తుల అని, కంపా అరుణ్, కోఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, షేక్ సుభాని, డీఈ ఐసయ్య, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. అలానే చీరాల రూరల్ మండలం రామకృష్ణాపురం–2 సచివాలయం పరిధిలో పార్టీ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు.


పావులూరులో ఇంటింటికి ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న నాయకులు


దగ్గుబాడులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ


యనమదలలో మాట్లాడుతున్న నాయకులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు

వేటపాలెం జంక్షన్ వద్ద కారు బీభత్సం


రోడ్డు పక్కన దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

వేటపాలెం: అర్ధరాత్రి కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. ఈఘటన వేటపాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు వైపు నుంచి చీరాల వైపు వెళ్తున్న కారు వేటపాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్దకు రాగానే రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వెంకటసాయి అనే యువకుడిని ఢీకొట్టి అదుపుతప్పింది. వెంటనే రోడ్డు పక్కనే ఉన్న రెండు దుకాణాల్లోకి తీసుకెళ్లింది. వెంకటసాయికి తీవ్రగాయాలు కావడంతో 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే అర్ధరాత్రి కావడంతో రెండు దుకాణాలు మూసివేసి ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. కారు నడుపుతున్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై జీ సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో


స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో

మేదరమెట్ల: ట్రాలీ ఆటో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈఘటన మంగళవారం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం తమ్మవరం రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తమ్మవరం రోడ్డు ఫ్లైఓవర్ వైపు నుంచి మేదరమెట్ల గ్రామం వైపు వస్తున్న ట్రాలీ ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. కాని విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఆప్రాంతంలో విద్యుత్ నిలిచిపోయింది.

ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వహించాలి


సూచనలందిస్తున్న ఎంపీడీవో నేతాజీ

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 27 నుంచి డిసెంబర్ 4 తేదీ వరకు నిర్వహించనున్న కులగణను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో కే నేతాజీ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో చీరాల మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు కుల గణనపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేస్తున్న కుల గణనను తూచా తప్పకుండా చేయాలన్నారు. 17 అంశాలను ప్రభుత్వ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను విస్మరించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, ఏఎస్‌వో రామకృష్ణ, వలంటీర్లు, పంచాయితీల సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు బీసీ కాలనీలో మంగళవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకుడు వసంతాచారి మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి స్వామి వారి వార్షికోత్సవం కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాట్లు తెలిపారు. చివరిరోజు అయిన బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

చలో కర్లపాలెం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పర్చూరు (చినగంజాం): రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీ బాపట్ల జిల్లా కర్లపాలెంలో జరిగే హలో దళిత చలో కర్లపాలెం సభను విజయవంతం చేయాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు. గుజ్జర్లపూడి ద్వారక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు అందరూ హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా పర్చూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు నలిగల కిషోర్ బాబు, గేరా స్వరాజ్, జూపూడి రోశయ్య, నీలం ప్రదీప్, యూత్ అధ్యక్షుడు కొంద్రు అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్

చినగంజాం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కే సురేష్ సూచించారు. మంగళవారం మండలంలోని కడవకుదురు గ్రామంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాటి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సెల్ ఫోన్‌ల ద్వారా మెసేజ్‌లు, ఓటీపీలు గురించి జాగ్రత్తగా ఉండాలని, తప్పుడు మెసేజ్‌లు పట్ల ప్రభావితం కావద్దని, ఓటీపీలు ఎవరితో పంచుకోవద్దని వివరించారు. తక్కువ ధరలకు వస్తువుల విక్రయించే యాప్‌లను నమ్మి మోసపోవద్దని వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆర్బీకే చైర్మన్‌కు ఎమ్మెల్యే పరామర్శ


రమణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చీరాల మండల ఆర్బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పరామర్శించారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. అలానే మెరుగైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు.

ఉచిత బ్రాహ్మణ వధూవరుల సమాచార కేంద్రం ప్రారంభం

చీరాల అర్బన్: బ్రాహ్మణ సేవా సమితి చీరాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని సంగం థియేటర్ వద్ద పాత నారాయణ క్యాంటీన్ వద్ద ఉచిత బ్రాహ్మణ వధూవరుల వివాహ సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు అధ్యక్షుడు అన్నంరాజు సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున బ్రాహ్మణ సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.